సాక్షి విజయనగరం

ఆదివారం । 28 । జనవరి । 2024



గర్భిణులకు అభయం
ప్రభుత్వాస్పత్రుల్లో గర్భిణులకు మెరుగైన వైద్యసేవలు అందుతున్నాయి. సుఖ ప్రసవాలకు నిలయంగా మారాయి.
- 8లో



'డీఆర్ఎం కప్'లో విజయనగరం సత్తా
- 8లో
ఓపెన్ టెన్నిస్ టోర్నమెంట్‌లో విజయనగరానికి చెందిన సుదర్శన్ రాజు, ఎం.వి.ఎల్.ఎన్.రాజు విజేతలుగా నిలిచారు.



రామతీర్థంలో ప్రత్యేక పూజలు
నెల్లిమర్లలోని పవిత్ర పుణ్యక్షేత్రం రామతీర్థం సీతారామస్వామి దేవస్థానంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు.
- 8లో

న్యూస్‌రీల్

కొత్త బాధ్యతలు

- ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణ జిల్లా కమిటీ మెంబర్‌గా అప్పారావు



వేపాడ: వేపాడ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కిలపర్తి అప్పారావును జిల్లా ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణ కమిటీ మెంబర్‌గా నియమిస్తూ ఇంటర్ బోర్డు కార్యదర్శి, ఆర్ఐఓలు ఉత్తర్వులు జారీచేశారు. ఈ మేరకు ఆయన శనివారం కొత్త బాధ్యతలు స్వీకరించారు. ప్రభుత్వం అప్పగించిన బాధ్యతలను చిత్తశుద్ధితో నెరవేర్చుతానని అప్పారావు తెలిపారు. ఆయనకు కళాశాల అధ్యాపకులు, సిబ్బంది అభినందనలు తెలిపారు.

ఇంటర్మీడియట్ పరీక్షలకు తత్కాల్ ఫీజు గడువు పెంపు

- ఆర్ఐఓ ఆదినారాయణ

విజయనగరం అర్బన్: వివిధ కారణాలతో ఇంటర్మీడియట్ పరీక్ష ఫీజు చెల్లించలేని విద్యార్థులకు తత్కాల్ ఫీజు గడువు ఈ నెల 29వ తేదీ వరకు పెంచినట్టు ఇంటర్మీడియట్ ప్రాంతీయ పర్యవేక్షణ అధికారి మజ్జి ఆదినారాయణ తెలిపారు. అదనంగా తత్కాల్ ఫీజు రూ.3 వేల ఆలస్యరుసుంతో ఆన్‌లైన్‌లో నెట్‌బ్యాంకింగ్ ద్వారా చెల్లించవచ్చన్నారు. ఫీజు చెల్లించని విద్యార్థులు ప్రభుత్వం కల్పించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.


చిన్నారుల్లో మరణాల రేటు తగ్గుదల



బాగుజోలలో చిన్నారులతో ముచ్చటిస్తున్న కలెక్టర్ నిషాంత్‌కుమార్

మక్కువ: ప్రభుత్వం మెరుగైన వైద్యసేవలు, పౌష్టికాహారం అందిస్తుండడంతో చిన్నారుల్లో మరణాల రేటు తగ్గిందని కలెక్టర్ నిషాంత్‌కుమార్ అన్నారు. మండలంలో బాగుజోల గ్రామంలో వైద్యశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రిజం కార్యక్రమాన్ని కలెక్టర్ నిషాంత్‌కుమార్ శనివారం పరిశీలించారు. గ్రామస్తులతో మాట్లాడి మాతా శిశు మరణాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై గిరిజనులకు అవగాహన కల్పించారు. చిన్నారులు, గర్భిణులు బాలింతలతో మాట్లాడారు. గర్భందాల్చిన వెంటనే పేర్లను ఆస్పత్రిలో నమోదు చేయాలని సూచించారు. క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేసుకోవాలని, వైద్యుల సూచనల మేరకు మందులు, పౌష్టికాహారం తీసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారి డా ఎం.వినోద్, వైద్యాధికారులు రఘు, తహసీల్దార్ ఎ.సూర్యనారాయణ, వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

కిచ్చాడలో ఏనుగుల గుంపు సంచారం



కురుపాం మండలం కిచ్చాడ గ్రామపరిసరాల్లో సంచరిస్తున్న ఏనుగు

కురుపాం: మండలంలోని కిచ్చాడ పరిసర ప్రాంతాల్లో ఏనుగుల గుంపు సంచరిస్తోందని, రైతులు, పాదచారులు జాగ్రత్తలు పాటించాలని అటవీశాఖ అధికారులు హెచ్చరికలు జారీచేశారు. రైతులు ఒంటరిగా పంట పొలాల్లోకి వెళ్లొద్దని సూచించారు.

రేగిడి కొండ వైపు ఏనుగులు

భామిని: ఇన్నాళ్లూ పొలాల్లో సంచరించిన నాలుగు ఏనుగుల గుంపు బాలేరు-నల్లరాయి గూడల సమీపం నుంచి రేగిడి కొండవైపు తరలివెళ్లినట్టు ఫారెస్టు బీట్ అధికారి లక్ష్మణమూర్తి తెలిపారు. రైతులకు ఏనుగుల బెడద తప్పిందన్నారు.

సమరోత్సాహం

- సీఎం వై.ఎస్.జగన్ పిలుపుతో వైఎస్సార్‌సీపీ క్యాడర్‌లో జోష్
- ప్రతి ఇంటికీ, ప్రతి గ్రామానికీ జరిగిన మేలేమిటో చెప్పాలని ఉత్సాహం
- 'వై నాట్ 175' నినాదంతో ఎన్నికల బరిలోకి కార్యకర్తలు
- సంగివలస సమావేశం విజయవంతంతో నూతనోత్తేజం



ఎన్నికల ఢంకా మోగిస్తున్న ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి, చిత్రంలో జెడ్పీచైర్మన్ శ్రీనివాసరావు

సాక్షి ప్రతినిధి, విజయనగరం: రాష్ట్రంలో 2024లో జరగనున్న సార్వత్రిక ఎన్నికలకు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సమరశంఖం పూరించారు. క్యాడర్‌ను ఉత్సాహపరుస్తూ విజయఢంకా మోగించారు. విశాఖపట్నం జిల్లా భీమిలి నియోజకవర్గంలోని సంగివలస కేంద్రంగా శనివారం జరిగిన వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర క్యాడర్ సమావేశం విజయవంతమైంది. ఊహించిన దానికన్నా లక్షలాది మంది ముఖ్య కార్యకర్తలు, నాయకులు పోటెత్తారు. విశాఖపట్నం-భువనేశ్వర్ జాతీయ రహదారి ట్రాఫిక్‌తో స్తంభించింది. 57 నెలల పాలన కాలంలో జరిగిన అభివృద్ధి, అమలుచేసిన సంక్షేమ పథకాలను, అన్ని వర్గాల వారికి చేసిన మేలును వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి వివరించిన తీరు క్యాడర్‌ను కట్టిపడేసింది. ప్రతి ఇంటికీ, ప్రతి గ్రామానికీ జరిగిన మేలేమిటో ఇంటింటికీ వెళ్లి వివరించాలన్న ఆయన పిలుపునకు నాయకులు, కార్యకర్తలు ఉత్సాహంతో స్పందించారు. మనందరి వైఎస్సార్‌సీపీని మళ్లీ అధికారంలోకి తెచ్చుకోవాలన్న పిలుపునకు కరతాళ ధ్వనులతో ఆమోదం తెలిపారు. 'వై నాట్ 175' నినాదంతో ఎన్నికల బరిలోకి దిగారు. మొత్తంమీద సంగివలస సమావేశంలో క్యాడర్‌లో నూతన ఉత్తేజాన్ని నింపింది.

అధినేత పిలుపుతో ఎన్నికల జోష్



వైఎస్సార్‌సీపీ అధినేత, ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సంగివలస సమావేశంలో చేసిన ప్రసంగం క్యాడర్‌లో ఎన్నికల జోష్ నింపింది. గత టీడీపీ ప్రభుత్వం ఏమీ చేయకుండానే ప్రజలను మభ్యపెడుతోందని, దీన్ని సమర్థంగా తిప్పికొట్టాలన్న పిలుపునకు క్యాడర్ బాగా స్పందించింది. రెండు నెలల్లో రానున్న సార్వత్రిక ఎన్నికలకు ఉత్తరాంధ్ర గడ్డపై నుంచే సమరభేరి మోగించడం నూతనోత్తేజాన్ని నింపింది.

– మజ్జి శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, జెడ్పీ చైర్మన్

సొంత వాహనాల్లో వచ్చినవారే ఎక్కువ



ఉత్తరాంధ్ర నుంచే ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల సమరభేరి మోగించడం క్యాడర్‌లో ఎంతో ఉత్సాహాన్ని నింపింది. ఈ సమావేశానికి సొంత వాహనాల్లో స్వచ్ఛందంగా వచ్చినవారే ఎక్కువ. రవాణా సౌకర్యాలు సరిపోక చాలామంది క్యాడర్ సమావేశానికి రాలేకపోయారు. అయినప్పటికీ లక్షల్లో కార్యకర్తలు పోటెత్తారు. రానున్న ఎన్నికల్లోనూ వైఎస్సార్‌సీపీ సాధించనున్న ఘన విజయానికి ఇది నిదర్శనం.

– కోలగట్ల వీరభద్రస్వామి, శాసనసభ డిప్యూటీ స్పీకరు

ప్రతిపక్షాలకు వణుకు పుట్టించారు



సంగివలసలో ఉత్తరాంధ్ర క్యాడర్‌ను ఉద్దేశించి ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి చేసిన ప్రసంగం ప్రతిపక్షాలను వణుకు పుట్టించింది. కేవలం ఉత్తరాంధ్రలోని 34 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో నాయకులు, ముఖ్యమైన కార్యకర్తలు వస్తేనే సభాప్రాంగణంలో రెండు లక్షలకు మించిపోయారు. అదే అందర్నీ పిలిచి బహిరంగ సభ పెడితే ఇక ఎలా ఉంటుందో ఊహించవచ్చు. ఈ సమావేశానికి వచ్చిన కార్యకర్తలు తమకు ప్రజల్లో ఎంతో గౌరవం పెంచిందన్న సంతృప్తితో ఉన్నారు. జగనన్న చెప్పాడంటే చేస్తాడంతే అన్న భరోసాతో ఎన్నికల సమరంలోకి దూకడానికి సిద్ధమయ్యారు.

– పీడిక రాజన్నదొర, ఉపముఖ్యమంత్రి

ఉత్తరాంధ్రలో ఒక ఊపు తెచ్చింది



ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పూరించిన సమరశంఖం ఉత్తరాంధ్రలో ఒక ఊపు తెచ్చింది. అనూహ్యంగా లక్షలాది మంది పార్టీ క్యాడర్ సంగివలసకు పోటెత్తింది. లక్షలాది మంది తరలివచ్చారు. ఈ సమావేశం వారిలో పూర్తి ఆత్మవిశ్వాసాన్ని నింపింది.

– కడుబండి శ్రీనివాసరావు, ఎస్.కోట ఎమ్మెల్యే

జగన్ వెంటే ఉత్తరాంధ్ర



ఉత్తరాంధ్రలోని 34 అసెంబ్లీ నియోజకవర్గాల్లో జనం అంతా జగన్‌మోహన్‌రెడ్డి వెంటే ఉన్నారనడానికి సంగివలసలో విజయవంతమైన వైఎస్సార్‌సీపీ క్యాడర్ సమావేశమే నిదర్శనం. అంతేకాదు ఈ సమావేశం ప్రజల్లో తమ గౌరవాన్ని పెంచిందని ప్రతి కార్యకర్తా గర్వంగా భావిస్తున్నారు.

– అలజంగి జోగారావు, పార్వతీపురం ఎమ్మెల్యే

మళ్లీ వైఎస్సార్‌సీపీదే గెలుపు...



కరోనా కాలం రెండేళ్లు పోగా మిగిలిన రెండున్నరేళ్లలోనూ వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో ప్రతి ఇంటికీ, ప్రతి గ్రామానికీ మేలు చేశారు. ఇంత తక్కువ కాలంలో అంతమందికి ప్రయోజనం కల్పించిన ఆయన్ను మరోసారి గెలిపించుకోవాలని క్యాడర్ ఉత్సాహంతో ఉంది. మళ్లీ వైఎస్సార్‌సీపీదే గెలుపు. సంగివలస సమావేశం క్యాడర్‌లో నూతన ఉత్తేజాన్ని నింపింది.

– విశ్వాసరాయి కళావతి, పాలకొండ ఎమ్మెల్యే

సంగివలస సమావేశం సూపర్ సక్సెస్



సంగివలసలో జరిగిన వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర క్యాడర్ సమావేశం సూపర్ సక్సెస్ అయ్యింది. ఊహించినదానికన్నా ఎక్కువ మంది తరలివచ్చారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సందేశం క్యాడర్‌లో జోష్ నింపింది. రానున్న ఎన్నికల్లో ఘన విజయం సాధించాలన్న ఆత్మవిశ్వాసంతో క్యాడర్ ఉంది.

– బొత్స అప్పలనర్సయ్య, గజపతినగరం ఎమ్మెల్యే

శంబర జాతర ఆదాయం రూ. 7.77లక్షలు

- జిల్లా ప్రజా రవాణాధికారి టీవీఎస్ సుధాకర్

పార్వతీపురంటౌన్: శంబర జాతరకు సంబంధించి ఆర్టీసీకి రూ.7.77లక్షల ఆదాయం వచ్చినట్టు జిల్లా ప్రజారవాణాధికారి టీవీఎస్ సుధాకర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పార్వతీపురం, పాలకొండ, సాలూరు డిపోల నుంచి మొత్తం 57 ప్రత్యేక బస్సుసర్వీసులు నడిపామన్నారు. మూడు రోజుల్లో రూ.7,77,505లు ఆదాయం వచ్చిందన్నారు. ఆర్టీసీపై నమ్మకం ఉంచి ఆర్టీసీని ఆదరిస్తున్న ప్రయాణికులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

తెలుగు సాహిత్యంలో రారవే వెలుగులు

- నేడు రాజాంరచయితల వేదిక వార్షికోత్సవం
- సాహిత్యకారులతో చర్చాగోష్ఠికి ఏర్పాట్లు
- 2015లో ఏర్పడిన రారవే

రాజాం రచయితల వేదిక
స్థాపితం 25.01.2015

రాజాం: సాహిత్యం, సమాజం రెండు కళ్లు అనే మూలసూత్రంతో జనవరి 25, 2015లో రాజాం రచయితల వేదిక (రారవే) ఆవిర్భవించింది. రాజాంకు చెందిన రిటైర్డ్ హెచ్ఎం గార రంగనాథం, మరికొందరు కవులతో కలిసి ఏర్పాటుచేసిన రారవే తొమ్మిదేళ్లు పూర్తిచేసుకుంది. ప్రతినెలా చివరి ఆదివారం ఒక సాహిత్య సమావేశం చొప్పున అనతి కాలంలోనే 107 సమావేశాలు పూర్తిచేసుకుని ఆదివారం (28వ తేదీ) 108వ సమావేశానికి సిద్ధమైంది. రాజాం పట్టణంలోని జేజే ఇనోటెల్ వేదికగా కేంద్ర సాహిత్య అకాడమీ, రారవే సంయుక్తంగా అబ్బూరి వరద రాజేశ్వరరావు పేరుతో సాహిత్య సదస్సు నిర్వహిస్తుంది. ఈ సమావేశాన్ని రాష్ట్ర నలుమూలలకు చెందిన సాహితీవేత్తలతో పాటు అకాడమీ తెలుగు కన్వీనర్ సి.మృణాళిని, తెలుగు సలహా మండలి సభ్యుడు చింతకింది శ్రీనివాసరావు తదితరులు పాల్గొననున్నారు.



రారవే ముద్రించిన పుస్తకాలు

ఉన్నతంగా రాణిస్తున్న రారవే కవులు

రారవే సభ్యులు తమ రచనలతో పేరుసంపాదిస్తున్నారు. రారవే నిర్వాహకుడు గార రంగనాథం వ్యాసాలు, కవితలు రాస్తుండగా, పిల్లా తిరుపతిరావు వ్యాసాలు, డాక్టర్ ఆల్తి మోహనరావు, పాదిలాపు శ్రీనివాసరావు వ్యాసకర్తలు, కథకులుగా రాణిస్తునఆనరు. కుదమ తిరుమలరావు, ఉరిటి గున్నేశ్వరరావు, పోలాకి ఈశ్వరరావు, కవితలు రాస్తూ మెప్పు పొందుతున్నారు. పద్య రచనలో గురుగుబెల్లి జగన్నాథరావు, ఒమ్మి రమణమూర్తి, కవితా రచనలో గార రంగనాథం, కుదమ తిరుమలరావు రాష్ట్ర, జాతీయ స్థాయిలో బహుమతులు పొందారు. రారవే వరుసగా మూడేళ్లపాటు గెడ్డాపు అప్పలస్వామి నందనందనం, వెంకటరావు పరిమళభావ తరంగాలు, గార రంగనాథం తరంగధ్వానాలు పుస్తకాలు ప్రచురితమయ్యాయి.

గిరిజన వర్సిటీ స్కిల్‌హబ్‌లో ఉపాధి కోర్సులు

విజయనగరం అర్బన్: కేంద్రీయ గిరిజయన యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన స్కిల్‌హబ్‌లో నిర్వహించే వివిధ ఉపాధి కోర్సులకు అర్హుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నామని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి డాక్టర్ ఎన్.గోవిందరావు తెలిపారు. వర్సిటీ, నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ (ఎన్ఏసీ) సంయుక్తంగా యువతకు రెండు నుంచి 3 నెలల పాటు శిక్షణ ఇచ్చి, సర్టిఫికెట్ అందజేస్తామన్నారు. 45 సంవత్సరాలలోపు వయసున్న 8వ తరగతి విద్యార్హత కలిగిన నిరుద్యోగ యువకులు శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అసిస్టెంట్ సర్వేయర్ కోర్సుకు ఇంటర్/డిగ్రీ విద్యార్హత, అసిస్టెంట్ ప్లంబర్ జనరల్ కోర్సుకు 8వ తరగతి/ఐటీఐ ఫిట్టర్ విద్యార్హత, ఫీల్డ్ టెక్నీషియన్, ఎయిర్ కండిషనర్ కోర్సులు 10వ తరగతి/ఐటీఐ విద్యార్హత ఉండాలని సూచించారు. పూర్తి వివరాల కోసం సెల్: 96525 15251, 70753 42406, 93982 86654 నంబర్లను సంప్రదించాలని కోరారు.

నిరుద్యోగులకు బాసటగా 'అభిలాష'

- సచివాలయాల్లో గ్రంథాలయాల ఏర్పాటు
- అందుబాటులో అన్నిరకాల పోటీ పరీక్షల పుస్తకాలు
- ఐటీడీఏ పీఓ విష్ణుచరణ్



గ్రంథాలయంలో పుస్తక వివరాలపై ఆరా తీస్తున్న ఐటీడీఏ పీఓ విష్ణుచరణ్

సీతానగరం: రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో నిరుద్యోగులైన యువత పోటీ పరీక్షల్లో విజేతలుగా నిలవడం కోసమే 'అభిలాష సామాజిక గ్రంథాలయాల'ను ఏర్పాటుచేసినట్టు పార్వతీపురం ఐటీడీఏ(పీఓ) సి.విష్ణుచరణ్ అన్నారు. కలెక్టర్ నిషాంత్‌కుమార్ ప్రత్యేక చొరవతో పెదభోగిలి పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన అభిలాష సామాజిక గ్రంథాలయాన్ని ఐటీడీఏ పీఓ సి.విష్ణుచరణ్, జిల్లా డ్వామాపీడీ కె.రామచంద్రరావు సందర్శించారు. ఈ సందర్భంగా పీఓ మాట్లాడుతూ అభిలాష గ్రంథాలయాలను నిరుదోగులైన యువత సద్వినియోగం చేసుకుని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని పిలుపునిచ్చారు. నిరుద్యోగ విద్యార్థులు వివిధ పోటీపరీక్షలకు సిద్ధమయ్యేందుకు అవసరమైన పుస్తకాలు గ్రంథాలయాల్లో అందుబాటులో ఉన్నాయన్నారు. జిల్లాలో మొదటిగా 97 గ్రామ సచివాలయాల పరిధిలో ఏర్పాటుచేసి పోటీ పరీక్షలకు అవసరమైన 66 రకాలకు చెందిన 12,804 పుస్తకాలను అందుబాటులో ఉంచామన్నారు.

వేగవంతంగా కులగణన సర్వే

- పదిరోజుల్లో ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ
- పేదల ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్లకు సిద్ధం కావాలి
- వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ నాగలక్ష్మి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న మండల స్థాయి అధికారులు



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి

విజయనగరం అర్బన్: జిల్లాలో కులగణన ప్రక్రియను మరింత వేగవంతంగా పూర్తిచేయాలని, ఆదివారం కూడా నిర్వహించాలని కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశించారు. వివిధ మండలాల ఎంపీడీఓలు, తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లతో శనివారం వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. కులగణన, ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ, ప్రభుత్వ పథకాలపై బెస్ట్ టెస్ట్ మెనూ, అసైన్డ్‌భూముల క్రమబద్ధీకరణ, పేదల ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్లు తదితర అంశాలపై మండలాల వారీగా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో చేపట్టిన కులగణనలో భాగంగా సచివాలయ సిబ్బంది, వలంటీర్లు ఇప్పటికే 80 శాతం ఇళ్లకు వెళ్లినా, 70 శాతం మంది వివరాలను మాత్రమే నమోదు చేశారని చెప్పారు. అన్ని కుటుంబాల్లో సభ్యుల పూర్తి వివరాలను నమోద చేసి, బయోమెట్రిక్ తీసుకోవాలని సూచించారు. ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీని పదిరోజుల్లో పూర్తి చేయాలన్నారు. ఆరోగ్యశ్రీ యాప్‌ను మొబైల్‌లో డౌన్‌లోడ్ చేయించాలని సూచించారు. జిల్లాకు 5.39 లక్షల కార్డులు రావాల్సి ఉండగా ఇప్పటివరకు సుమారు 4.11 లక్షల కార్డులు వచ్చాయని తెలిపారు. అసైన్డ్ భూముల క్రమబద్ధీకరణ ప్రక్రియ నెమ్మదిగా సాగడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. జిల్లాలో ఇప్పటివరకు సుమారు 9,700 ఎకరాలను గుర్తించినా, తహసీల్దార్లు నివేదికలు అందజేయడంలో ఆలస్యం చేస్తున్నారన్నారు. నవరత్నాలు-పేదలలందరికీ ఇళ్లు కార్యక్రమం కింద పేదలకు ఇచ్చిన ఇళ్ల పట్టాలను, ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణం రిజిస్ట్రేషన్ చేయాలన్నారు. డీఆర్‌డీఏ పీడీ ఎ.కళ్యాణ చక్రవర్తి మాట్లాడుతూ వైఎస్సార్ పింఛన్ కానుక, ఆసరా, చేయూత వంటి ప్రభుత్వ పథకాలకు సంబంధించి వలంటీర్ల నుంచి టెస్ట్ మోనూ చేరాల్సిన గడువు ఇప్పటికే ముగిసిందని చెప్పారు. వాటిని ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు పరిశీలించి, ప్రతీ మండలం నుంచి ఒక్కో అంశానికి రెండు చొప్పున ఈ నెల 30 లోగా జిల్లా స్థాయికి అప్‌లోడ్ చేయాలని చెప్పారు. జిల్లా స్థాయి కమిటీ వాటిని పరిశీలించి, ఉత్తమంగా ఉన్న వాటిని ఎంపిక చేస్తుందని చెప్పారు. మండల స్థాయిలో ఉత్తమంగా ఎంపికైన వాటికి రూ.15 వేలు, నియోజకవర్గ స్థాయిలో రూ.20 వేలు, జిల్లా స్థాయిలో రూ.25 వేలు నగదు బహుమతి ఇవ్వడం జరుగుతుందని వివరించారు. వలంటీర్లకు సన్మానం జరిగే ఫిబ్రవరి 4న బహుమతి ప్రదానం ఉంటుందని పీడీ తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్‌లో సచివాలయాల స్పెషల్ ఆఫీసర్ నిర్మలాదేవి, జెడ్పీ సీఈఓ కె.రాజ్‌కుమార్, మెప్మా పీడీ సుధాకరరావు, డీఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ ఎస్.భాస్కరరావు, డీపీఓ శ్రీధర్‌రాజా, డీఎల్‌డీఓ లక్ష్మణరావు, తదితతరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

బైక్ దగ్ధం



కాలిపోయిన బైక్

వేపాడ: మండలంలోని బక్కునాయుడుపేట గ్రామంలో శుక్రవారం అర్ధరాత్రి ద్విచక్ర వాహనం దగ్ధమైంది. ఇందుకు సంబంధించి స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు... గ్రామానికి చెందిన కోన గణేష్, నాయుడు పల్సర్ ద్విచక్ర వాహనంపై శుక్రవారం బల్లంకి వెళ్లారు. బల్లంకిలో గ్రామదేవత తీర్థం సందర్భంగా ప్రదర్శించిన కార్యక్రమాన్ని చూసి రాత్రి 12 గంటల సమయంలో బక్కునాయుడుపేట చేరుకుని బైక్ ఇంటి వద్ద పెట్టారు. కొద్ది సేపటికి మంటలు వ్యాపించి బండి కాలిపోతుండటంతో స్థానికులు చూసి తమను పిలిచారని వెంటనే వెళ్లి మంటలు అదుపు చేసినప్పటికి బండి పూర్తిగా కాలిపోయిందని వాపోయారు. వల్లంపూడి పోలీసులకు సమాచారం ఇవ్వటంతో వల్లంపూడి ఎస్‌ఐ రమేష్ నాయుడు సంఘటనా స్థలాన్ని పరిశీలించినట్టు చెప్పారు.

చెరువులో పడి వ్యక్తి మృతి



అప్పలనాయుడు మృతదేహం

జామి: చెరువులో పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. కుటుంబ సభ్యులు, స్థానికులు తెలిపిన వివరాలు.. ఎం.కె.వలస గ్రామానికి చెందిన సారిక అప్పలనాయుడు (43) గ్రామ శివారులో ఉన్న చెరువులో పశువులను శుభ్రం చేసేందుకు శనివారం వెళ్లాడు. ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెందాడు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు అప్పలనాయుడును వెలికితీశారు. అప్పటికే మృతి చెందడంతో పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించారు. ఏఎస్‌ఐ నర్సింగరావు కేసు నమోదు చేశారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

మద్యం సీసాలతో ఒకరి అరెస్టు

బొబ్బిలి: మండలంలోని ఎం.బూర్జివలస గ్రామానికి చెందిన గొర్లె తిరుపతిరావు స్కూటీలో 21 మద్యం బాటిళ్లను తరలిస్తున్న సమాచారం మేరకు హెచ్‌సీ సీహెచ్ స్వామినాయుడు గ్రామ పొలిమేరల్లో పట్టుకొని అరెస్టు చేశారు. అతని నుంచి మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకొని స్కూటీని సీజ్ చేశామని తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ ఎం.నాగేశ్వరరావు తెలిపారు.


ఇసుక ట్రాక్టర్ల పట్టివేత



పట్టుబడిన ఇసుక ట్రాక్టర్లతో ఎస్‌ఐ జ్ఞాన ప్రసాద్, సిబ్బంది

రామభద్రపురం: మండలంలోని రొంపల్లి, ఎస్.సీతారాంపురం బస్ షెల్టర్ వద్ద శనివారం ఏ విధమైన అనుమతి లేకుండా ఇసుక అక్రమంగా తరలిస్తున్న ఐదు ట్రాక్టర్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం అక్రమంగా ఇసుక తరలిస్తున్నట్టు వచ్చిన సమాచారం మేరకు కాపలా కాయగా ఇసుకతో వస్తున్న ట్రాక్టర్లు పట్టుబడ్డాయి. ఏ విధమైన అనుమతులు లేకపోవడంతో ఇసుకతో ట్రాక్టర్లను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఎస్‌ఐ జ్ఞానప్రసాద్ కేసు నమోదు చేశారు.

మహిళల కబడ్డీ పోటీల విజేత పాగిరి



జిల్లా స్థాయి పోటీలకు వెళ్లనున్న పాగిరి మహిళల కబడ్డీ జట్టుతో మున్సిపల్ కమిషనర్ నాగరాజు, తదితరులు

రాజాం సిటీ: నియోజకవర్గ స్థాయిలో నిర్వహించిన ఆడుదాం ఆంధ్రా క్రీడాపోటీల్లో మండలంలోని పాగిరి గ్రామ మహిళల కబడ్డీ జట్టు విజేతగా నిలిచిందని మున్సిపల్ కమిషనర్ ఎంవీ నాగరాజు తెలిపారు. శనివారం స్థానిక జీసీఎస్‌ఆర్ కళాశాల మైదానంలో కబడ్డీ, వాలీబాల్ ఫైనల్ పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో సంతకవిటి మండలంలోని తలంపర జట్టుపై పాగిరి మహిళల కబడ్డీ జట్టు విజయ సాధించగా, రేగిడి జట్టుపై సంతకవిటి మహిళల వాలీబాల్ జట్టు గెలుపొందిందన్నారు. ఆయా జట్లు త్వరలో జరిగే జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొంటాయన్నారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹120	₹210	₹220

గర్భిణులకు అభయం

ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లాలంటేనే భయపడే గర్భిణులు...గడిచిన కొన్నేళ్లుగా తమ ప్రసవానికి అక్కడికే వెళ్తున్నారు. ఇందుకు కారణం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక నాడు – నేడుతో ప్రభుత్వ ఆస్పత్రుల రూపురేఖలను మార్చేశారు. సకల సదుపాయాలు.. కావాల్సినంత మంది వైద్యులు, సిబ్బందిని నియమించి ప్రజారోగ్యానికి ఎనలేని ప్రాధాన్యత కల్పించారు. దీంతో సుఖ ప్రసవమన్నా... సాధారణ ప్రసవం కావాలన్నా.. ప్రభుత్వ ఆస్పత్రులకే వెళ్లాలని గర్భిణులు భావిస్తున్నారు. దీంతో ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాలు భారీగా పెరిగాయి.

- ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవానికి ఆసక్తి చూపుతున్న గర్భిణులు
- ఆస్పత్రుల్లో మౌలిక వసతులు కల్పించిన ప్రభుత్వం
- ఏటా 15 వేలు నుంచి 19 వేల వరకు ప్రసవాలు
- పీహెచ్‌సీల్లో కూడా ప్రసవాలు



గజపతినగరం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాలింతలు

ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాల వివరాలు

సంవత్సరం	ప్రసవాల సంఖ్య
2019-20	19,688
2020-21	18,713
2021-22	17,880
2022-23	9,206
2023-24	7,088

విజయనగరం ఫోర్ట్: ప్రభుత్వ ఆస్పత్రులు సుఖ ప్రసవాలకు నిలయంగా మారాయి. గత టీడీపీ హయాంలో ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాలు సకాలంలో నిర్వహించరనే అపవాదు ఉండేది. అటువంటి అపవాదును ప్రస్తుత జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం చెరిపి వేసింది. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాలు చేయించుకోవడం సురక్షితం అనే భావనను మహిళల్లో కల్పించింది. దీంతో ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాలు జరిపించుకోవడానికి మహిళలు ఆసక్తి కనబరుస్తున్నారు. ఫలితంగా ప్రసవాల సంఖ్య కూడా గణనీయంగా పెరిగింది. సిజేరియన్లకు కాకుండా సాధారణ ప్రసవాలకే ప్రభుత్వ ఆస్పత్రుల్లో అధిక ప్రాధాన్యత ఇస్తుండడంతో ప్రభుత్వ ఆస్పత్రులు వైపు గర్భిణులు మొగ్గు చూపేటట్టు చేస్తుంది. దీనికి తోడు డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఉచితంగా ప్రసవం జరిపిస్తున్నారు. ఆరోగ్య ఆసరా కింద వీరికి రూ.5 వేలు ప్రోత్సాహకంగా అందజేస్తున్నారు. ప్రైవేటు ఆస్పత్రుల్లో ప్రసవాలు ఎక్కువగా జరుతాయనే భావన ఉండేది. ఇప్పుడు అందుకు భిన్నంగా ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే ప్రసవాలు అధికంగా జరుగుతున్నాయి. పీహెచ్‌సీల్లో సైతం ప్రసవాలు జరుగుతున్నాయంటే జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో వైద్య రంగంలో ఎంతటి మార్పు తీసుకొచ్చిందో అర్థం అవుతుంది.

జిల్లాలో ప్రసవాలు నిర్వహించే ప్రభుత్వ ఆస్పత్రులు

ప్రసవాలు నిర్వహించే ప్రభుత్వ ఆస్పత్రులు జిల్లాలో 57 ఉన్నాయి. వాటిలో 48 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు (పీహెచ్‌సీ), 5 సామాజిక ఆరోగ్య కేంద్రాలు (సీహెచ్‌సీ)లు, మూడు ప్రాంతీయ ఆస్పత్రులు (ఏరియా ఆస్పత్రులు) ఘోషాస్పత్రి ఒకటి ఉన్నాయి.

నాలుగున్నరేళ్లలో 1,27,481 ప్రసవాలు:

నాలుగున్నరేళ్లలో జిల్లాలో 1,27,481 ప్రసవాలు జరిగాయి. ఇందులో సాధారణ ప్రసవాలు 72,575 ఉన్నాయి. ప్రైవేటు ఆస్పత్రుల్లో 54,900 ప్రసవాలు జరిగాయి. ప్రభుత్వ ఆస్పత్రుల్లో సాధారణ ప్రసవాలకే అధిక ప్రాధాన్యతను ఇస్తున్నారు. సాధ్యమైనంత వరకు సాధారణ ప్రసవం జరిపించడానికి వైద్యులు ప్రయత్నిస్తున్నారు. సాధారణ ప్రసవం సాధ్యం కాని పక్షంలో మాత్రమే సిజేరియన్ చేస్తున్నారు. కాని ప్రైవేటు ఆస్పత్రుల్లో మాత్రం సిజేరియన్లకే అధిక ప్రాధాన్యత ఇస్తున్నారు. కాసుల కోసం సిజేరియన్లు ఎక్కువగా చేస్తున్నారు.

నాడు–నేడుతో మారిన ఆస్పత్రుల రూపురేఖలు

నాడు – నేడు కార్యక్రమం ద్వారా ఆస్పత్రుల రూపురేఖలు మార్చేశారు. పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలు, ఏరియా ఆస్పత్రులు, జిల్లా ఆస్పత్రుల రూపురేఖలు ప్రభుత్వం సమూలంగా మార్చేసింది. అన్ని ఆస్పత్రుల్లో ప్రసవాలు నిర్వహించడానికి అవసరమైన కాన్పు గదులు, థియేటర్లను ఆధునీకరించారు. అవసరమైన పరికరాలు సమకూర్చారు. జిల్లాలో అతిపెద్ద మాతా, శిశు ఆస్పత్రి అయిన ఘోషాస్పత్రిలో అత్యవసర సమయంలో గర్భిణులకు, బాలింతలకు చికిత్స అందించేందుకు హైబ్రిడ్ ఐసీయూను ఏర్పాటు చేశారు. దీంతో రిఫరల్స్ చాలా వరకు తగ్గాయి. ఎస్ఎన్‌సీయూ (నవజాతి శిశువుల ప్రత్యేక సంరక్షణ కేంద్రం)లో సెంటర్‌లైజడ్ వెంటిలేటర్ సిస్టమ్ ఏర్పాటు చేశారు. వార్మర్స్, ఫొటోథెరపి ఆధునాతన పరికరాలు ఉన్నాయి.

అధిక ప్రసవాలు



ప్రభుత్వ ఆస్పత్రుల్లో అధికంగా ప్రసవాలు నిర్వహిస్తున్నారు. ప్రసవాలు నిర్వహించడానికి అవసరమైన అన్ని వసతులు ప్రభుత్వం కల్పించింది. సాధారణ ప్రసవాలకు అధిక ప్రాధాన్యత ఇస్తుండడంతో గర్భిణులు ప్రసవాలు జరిపించుకోవడానికి ముందుకు వస్తున్నారు.

– డాక్టర్ ఎస్.భాస్కరరావు , డీఎంహెచ్‌ఓ

అటల్ మారథాన్ పోటీలను విజయవంతం చేయాలి

- డిప్యూటీ ఈఓ వాసుదేవరావు



మాట్లాడుతున్న డిప్యూటీ ఈఓ వాసుదేవరావు

విజయనగరం అర్బన్: జాతీయ స్థాయిలో జరిగే అటల్ మారథాన్ పోటీలలో పాల్గొని విజయవంతం చేయాలని డిప్యూటీ ఈఓ కె.వాసుదేవరావు కోరారు. జిల్లా సైన్స్ అధికారి ఎం.కృష్ణారావు అధ్యక్షతన కొత్తపేటలోని స్థానిక పల్లవి విద్యామందిర్‌లో అటల్ మారథాన్ పోటీలపై జిల్లాలోని ఏటీఎల్ ల్యాబ్‌ల ప్రధానోపాధ్యాయులు, ల్యాబ్ ఇన్‌చార్జి ఉపాధ్యాయులకు అవగాహన సదస్సు శనివారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా విద్యార్థులలో సమస్య – పరిష్కార ఆలోచనలు విద్యార్థులలో పెంచేందుకు అటల్ మారథాన్ పోటీలు నిర్వహిస్తారని తెలిపారు. సైన్స్ ఉపాధ్యాయులు అందరూ ప్రతి పాఠశాల నుంచి 5 ప్రాజెక్టుల చొప్పున ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. పుణే నుంచి విజ్ఞాన్ ఆశ్రం ప్రతినిధి వెంకటేష్ ఆన్‌లైన్‌లో దీనిపై అవగాహన కల్పించారు. జాతీయ స్థాయి గుర్తింపు ఇచ్చే ఈ పోటీలు విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లాకు చెందిన ఏటీఎల్ ల్యాబ్‌ల ప్రధానోపాధ్యాయులు, లోఫ్స్ ఇన్‌చార్జి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ఏటీఎల్ ల్యాబ్‌ల ప్రధానోపాధ్యాయులు, ల్యాబ్ ఇన్‌చార్జ్ టీచర్స్

చెరువులో పడి యువకుడి మృతి



ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెందిన యువకుడు సతీష్

లక్కవరపుకోట: మండలంలోని చందులూరు గ్రామ శివారులో ఉన్న చెరువులో పడి విశాఖపట్నం జిల్లా ఆరిలోవ ప్రాంతానికి చెందిన ఆటో చోదకుడు గొలగాని సతీష్(22) శనివారం మృతి చెందాడు. ఈ ఘటనకు సంబంధించి స్థానిక ఎస్‌ఐ ఆర్. గోపాలరావు తెలిపిన వివరాలు..

ఆరిలోవ ప్రాంతానికి చెందిన కొంత మంది క్రైస్తవ మత ప్రచారకులను ఆటోలో తీసుకొని చందులూరు గ్రామానికి మృతుడు సతీష్ తన ఆటోలో శనివారం తీసుకొచ్చాడు. మత ప్రచారకులు గ్రామంలో పర్యటించగా సతీష్ ఆటోలోనే ఉండిపోయాడు. కొద్దిసేపటి తరువాత ఆటోను అక్కడ వదిలి బహిర్భూమికై సమీపంలో గల చెరువు వద్దకు వెళ్లాడు. అందులో ప్రమాదవశాత్తు జారి పడి సతీష్ మృతి చెందాడు. కాగా మత ప్రచారకులు తిరుగు ప్రయాణం నిమిత్తం సతీష్‌ను వెదికినా ప్రయోజనం లేకపోయింది. దీంతో మృతుడు సెల్‌ఫోన్‌కు ప్రచారకులు ఫోన్ చేయగా చెరువు సమీపంలో ఒక మహిళకు దొరకడంతో ఆమె సెల్‌లో మాట్లాడి, సెల్ తనకు దొరికిందని సమాధానం చెప్పింది. దీంతో ఆ ప్రాంతంలో మత ప్రచారకులు గాలించగా సతీష్ చెరువులో విగతజీవిగా కనిపించాడు. స్థానికుల సమాచారంతో ఎస్‌ఐ గోపాలరావు తన సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకొని శవ పంచనామ నిర్వహించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎస్.కోట సీహెచ్‌సీకి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు. కుటుంబ సభ్యులకు సమాచారం అందజేశారు.

రామతీర్థంలో ప్రత్యేక పూజలు



యాగశాలలో హోమం జరిపిస్తున్న అర్చకులు

నెల్లిమర్ల రూరల్: పవిత్ర పుణ్యక్షేత్రం రామతీర్థం సీతారామస్వామి దేవస్థానంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామికి ప్రాతః కాలార్చన, బాలభోగం నిర్వహించిన తర్వాత యాగశాలలో విశేష హోమాలు చేపట్టారు. అనంతరం స్వామి వెండి మంటపం వద్ద నిత్య కల్యాణ మహోత్సవాన్ని వేడుకగా జరిపించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

దేవదాయ శాఖ ఆధ్వర్యంలో వివిధ ప్రాంతాలకు చెందిన కళాకారులు రామతీర్థంలో కళారాధన నిర్వహించారు. భక్తి గీతాలకు మహిళలు కోలాటమాడి అలరించారు.



ఆలయ ప్రాంగణంలో కోలాటమాడుతున్న మహిళలు

‘డీఆర్‌ఎం కప్’లో విజయనగరం సత్తా



విజేతలతో ఆఫీసర్స్ క్లబ్ టెన్నిస్ క్రీడాకారులు

విజయనగరం: విశాఖపట్నం వాల్తేరు రైల్వేస్టేషన్ స్టేడియంలో నిర్వహించిన డీఆర్‌ఎం కప్ ఆల్ ఇండియా ఓపెన్ టెన్నిస్ టోర్నమెంట్ 45 ప్లస్ డబుల్స్ విభాగంలో విజయనగరానికి చెందిన సుదర్శన్ రాజు, ఎం.వి.ఎల్.ఎన్.రాజు విజేతలుగా నిలిచారు. ఈ నెల 22 నుంచి మూడు రోజుల పాటు విశాఖలో ఈ పోటీలు జరిగాయి. 45 ప్లస్ డబుల్స్ విభాగంలో విజేతలు సుదర్శన్, ఎం.వి.ఎల్.ఎన్ రాజులను ఆఫీసర్స్ క్లబ్ టెన్నిస్ క్రీడాకారులు సత్కరించారు. కార్యక్రమంలో ఇండియా మాజీ కోచ్ సన్నిబాబు, జాతీయ క్రీడాకారులు సన్యాసిరావు, శంకరరావు, ఇతర సీనియర్ క్రీడాకారులు పాల్గొన్నారు. క్లబ్ కార్యదర్శి విజేతలను అభినందించారు.

31న రీజనల్ జాబ్ మేళా

పార్వతీపురం టౌన్: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఉపాధి కల్పనలో భాగంగా ఎస్ఎస్‌సీ, ఇంటర్మీడియెట్, ఐటీఐ, డిగ్రీ, బీటెక్, డిప్లొమా, ఎంఎస్సీ, ఎంబీఏ చదువుకున్న యువతకు రీజనల్ జాబ్ మేళా నిర్వహిస్తున్నట్టు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి యు.సాయికుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వయస్సు 18 నుంచి 30 సంవత్సరాల మధ్య ఉన్నటువంటి నిరుద్యోగ యువతీ, యువకులకు ఈ నెల 31వ తేదీన ఉదయం 9 గంటల నుంచి సత్య ఇనిస్టిట్యూట్ అఫ్ టెక్నాలజీ – మేనేజ్‌మెంట్ కాలేజి, విజయనగరంలో జాబ్ మేళా నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. మేళాకు ఐటీ, ఫార్మా, మ్యాన్‌ఫ్యాక్చరింగ్, బ్యాంకింగ్, రిటైల్, ఆటోమొబైల్, మార్కెటింగ్, లాజిస్టిక్స్, టెక్స్‌టైల్స్, కాస్మోటిక్స్, సర్వీస్, హాస్పిటాలిటీ తదితర రంగాల కంపెనీ ప్రతినిధులు హాజరవుతారని పేర్కొన్నారు. అర్హత కలిగిన అభ్యర్థులను ఎంపిక చేస్తారని పేర్కొన్నారు. 82 కంపెనీలలో 5849 ఉద్యోగ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆసక్తి కలిగిన నిరుద్యోగ యువతీ యువకులు తమ వివరాలను స్కిల్ యూనివర్స్.ఏపీఎస్ఎస్‌డీసీ.ఇన్ వెబ్‌సైట్‌లో తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. రిఫరెన్స్ నంబరుతో పాటు రెజ్యూమ్, ఆధార్ కార్డు, విద్యార్హత సర్టిఫికెట్లు ఒరిజినల్, జెరాక్స్, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోతో ఉదయం 9 గంటలకు హాజరు కావాలని సూచించారు. వివరాలకు 63051 10947, 63012 75511 నంబర్లను సంప్రదించాలన్నారు.

ఐక్య కలయికకు సర్వం సిద్ధం

- ఏపీ మైనార్టీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ మహమ్మద్ నజీర్



ఐక్య కలయిక సభా వివరాలు వెల్లడిసున్న ఏపీ మైనార్టీస్ కార్పొరేషన్ డైరెక్టర్ నజీర్

విజయనగరం టౌన్: క్రిస్టియన్, ముస్లిం, ఎస్సీ, ఎస్టీల ఐక్య కలయిక కార్యక్రమాన్ని ఈ నెల 29న ఉదయం 9 గంటలకు కలెక్టరేట్ వద్ద భారీ ఎత్తున నిర్వహించనున్నట్టు ఏపీ మైనార్టీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ మహమ్మద్ నజీర్ తెలిపారు. స్థానిక మైనార్టీ కార్పొరేషన్ కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడారు. విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో ముస్లిం, క్రిస్టియన్, ఎస్సీ, ఎస్టీ ప్రజలకు తమ సంఘాలతో వేలాది మందిగా తరలిరావాలని పిలుపునిచ్చారు. భారతదేశ రాజ్యాంగం కల్పించిన మత స్వేచ్ఛా హక్కులను పరిరక్షించడం కోసం, లౌకిక రాజ్యాన్ని కాపాడటం, మైనార్టీల ఐక్యతను నిరూపించేందుకే సభను ఏర్పాటు చేశామన్నారు. అందరి సమష్టి కృషితోనే తమ హక్కులను పరిరక్షించుకోగలుగుతామన్నారు. భారీ ఎత్తున నిర్వహించే ఐక్య కలయిక కార్యక్రమంలో హైకోర్టు అడ్వకేట్లు డాక్టర్ డి.సుధాకర్, సోనియా మడికి తదితరులు పాల్గొంటారన్నారు. ఆయన వెంట రెవరెండ్ ఎస్.మధు, డాక్టర్ పి.ప్రేమానందం, డాక్టర్ ఉదయ్ చంద్ర, బిషప్ ఎం.పాల్సన్, ఎలీషా, భాషా, వాజీ, మస్తాన్, గోక రమేష్ బాబు ఉన్నారు.

పెండింగ్ ఈ చలానాలను చెల్లించాలి

విజయనగరం క్రైమ్: వాహన చోదకులు పెండింగ్‌లో ఉన్న అపరాధ రుసుంలను చెల్లించాలని ట్రాఫిక్ ఎస్‌ఐ లోవరాజు తెలిపారు. స్థానిక కోట జంక్షన్, ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద విజిబుల్ పోలీసింగ్ నిర్వహించారు. మూడు, నాలుగు నెలల నుంచి పెండింగ్‌లో ఉన్న ఈ చలానాలను కట్టని వారిని గుర్తించి, చలానాలను త్వరితగతిన కట్టాలని సూచించారు. వాహన చోదకులు తమ వద్ద వాహనాలకు సంబంధించిన పత్రాలను జాగ్రత్తగా ఉంచాలన్నారు. అపరాధ రుసుం విధించిన ఈ చలానాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో కట్టాలని సూచించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.